అనసూయ

పి. నరసింగరావు

రాత్రి పదకొండుగంటలు కొట్టారు. శస్త్ర చికిత్స వార్డులోని రోగులందరూ ఇంచుమించు విశ్రాంతి తీసుకుంటున్నారు. వార్డులోని పెద్ద దీపాలన్నీ ఆర్పేశారు. చిరంజీవికి ఆపరేషన్ అయి అప్పటికి నాలుగైదు రోజులయింది. అంతకుముందు పది, పదిహేను రోజులనుంచి నిత్యం ఆస్పత్రిలో రాత్రి పగలూ అనే విచక్షణలేక గంటలతరబడి ఉండడంచేత, ఇంచుమించు ఆ వార్డు నర్సులందరితోనూ నాకు పరిచయమైంది. పెద్ద డాక్టరుగారికి ముందే బాగా ముట్టచెప్పడంచేత, చిరంజీవి విషయంలో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయించారు. మిగిలిన నర్సులందరి మాట ఎలాఉన్నా, అనసూయ మాత్రం తన పనులు చాలా ఓర్పుతోనూ, నేర్పుతోనూ చేసుకుపోయేది. రాత్రి ఎవరు ఎన్నిసార్లు పిలిచినా, విసుక్కోకుండా సపర్యలు చేసేది. అసలు మొదటిరోజున అనసూయను చూచిన కొద్దిసేపటికే ఆమెతో మాట్లాడదామనిపించింది. ఇదేమంత కష్టమైన పని కాకపోబట్టి, మూడు నాలుగు రోజులలో కొద్ది పరిచయం ఏర్పడింది. దానికితోడు, నేను కాలక్షేపానికని తీసుకువెళ్ళే పత్రికలూ, పుస్తకాలు ఆమెను ఆకర్షించేవి. అడిగి తీసుకుని తీరికసమయాలలో చదువుకునేది.

ఎంత ప్రయత్నించినా నిద్రరాకపోవడం వల్ల ఏదో పత్రిక తిరగవేస్తూ చిరంజీవి మంచానికి కొద్దిగా దూరంగా వరండాలో బల్లమీద కూర్చున్నా.

"ఏమండీ ఇంకా నిద్రపోలేదా?" అంటూ అనసూయ వచ్చి మరొక బల్ల లాక్కుని నాకు దగ్గరగా కూర్చుంది.

"చిరంజీవిగారు మీకు ఏమౌతారు?" అన్నదామె.

"మా మేనత్తకొడుకు"

"ఈయన ఏం చేస్తున్నారు?"

"రాజమండ్రి బ్రూక్‌బాండ్ కంపెనీలో ఎక్కౌంటెంట్."

"మరి మీరేంచేస్తున్నారు?"

"మొన్న మార్చిలో ఇంటర్ పరీక్షకు వెళ్ళా."

"ఈయనకు వివాహమయిందా?"

"లేదు."

"శీనుగారు మీకు ఏమౌతారండీ?

"చిరంజీవి తమ్ముడు. మేం ఇద్దరంకలసి మా పినతండ్రిగారింట్లో చదువుకుంటున్నాం. వాడూ నాతో బాటే ఇంటర్ పరీక్షలకు కూర్చున్నాడు."

ఇంకా ఏమేమో ప్రశ్నలడిగింది, అన్నిటికీ జవాబులు చెప్పా. రెండుమూడు దినాల నుంచి, ఆమెగురించి వివరాలు తెలుసుకుందామనే కుతూహలం ఉండడంచేత ఈ అవకాశం వదులుకోకూడదనుకొని, "ఏమండీ మీదేవూరు?" అన్నాను.

"బళ్ళారి"

"మీరు ఈ పనిలో అభిలాషఉండే చేరేరా?"

"లేదండీ. కేవలం పరిస్థితుల ఒత్తిడివల్ల చేరవలసివచ్చింది."

"ఎంతకాలమైందండీ మీరు చేరి?"

"రెండునెలలు."

"మీకు తెలిసినవాళ్ళు ఎవరైనా ఈ ఊళ్ళో ఉన్నారా?"

"లేరండి. కనీసం మీఅంతదయగా మాట్లాడినవాళ్లైనా ఎవరూ లేరు"

"ఎలాఉందండీ మీ పని?"

"ఏడుపొస్తుందండీ. కాని ఏం చెయ్యడం?"

"అసలు మీరు అంతదూరంనుంచివచ్చి నర్సుగా ఎందుకు చేరవలసివచ్చింది? చక్కగా ఎవరినైనా తగినవాణ్ణి చూసుకుని పెళ్ళిచేసుకోలేక పోయారా?"

ఆమె నిరుత్సాహంగా తన కథ చెప్పుకు పోయింది. తాను ఒక సామాన్య కుటుంబానికి చెందిందట. తండ్రి రాష్ట్రప్రభుత్వంలో ఉద్యోగం చేస్తూ హఠాత్తుగా మరణించడంచేత ఇతరత్రా ఆస్తిపాస్తులుగాని, చేరదీసే దగ్గర బంధువులుగాని లేకపోవడంచేత తనూ, తల్లి ఫిఫ్తుఫారం చదువుకున్న తమ్ముడూ దిక్కులేనివాళ్ళయ్యారట. తగిన సంబంధం కావాలంటే, కనీసం రెండు మూడు వేల రూపాయిలైనా ఖర్చు చెయ్యాలి. తన తండ్రి తాలూకు ప్రావిడెంటుఫండు సుమారు నాలుగు వేల రూపాయిల వరకూ వచ్చినా ఈ సొమ్ము ఖర్చుచేసి తాను వివాహం చేసుకుంటే, తన తల్లి, తమ్ముని భవిష్యత్తు ఏం కావాలి? అంచేత, అప్పటికే స్కూలు ఫైనల్ ప్యాసై ఉండడంచేత ఏదైనా ఉద్యోగంలో చేరి, తమ్ముణ్ణి కనీసం స్కూలు ఫైనల్ వరకైనా చదివించాలని పట్టుబట్టి తల్లిని ఒప్పించి, ఆ ప్రయత్నం చెయ్యకుండానే లభించింది కదా అని స్వస్థలానికి దూరమైనా వచ్చి నర్సుగా చేరనని చెప్పింది. తెల్లవారుఝామున ఇంచుమించు ఐదుగంటలదాకా మాట్లాడుతూనే ఉన్నాం. మధ్యలోమాత్రం రెండు మూడుసార్లు ఎవరో రోగులు పిలవడంచేత ఆమె వెళ్ళి వాళ్ళకు సపర్యలుచేసి తిరిగి వచ్చింది. ఐదు గంటలయిన తరువాత మా శీను వచ్చాడు. జంబుఖానా, తలగడా చుట్టుకుని ఇంటికి బయలుదేరా.

* * *

రాత్రల్లా నిద్రలేకపోవడంనుంచి ఇంటికి రాగానే ముఖం కడుక్కుని, కాఫీ తాగి నిద్రపోయా. బహుశా పన్నెండు గంటల ప్రాంతంలో మా పినతండ్రిగారి కూతురు "అన్నా! అమ్మ అన్నానికి రమ్మంటోంది" అని లేపింది. స్నానంచేసి భోజనానికి కూర్చున్నా. మా పినతండ్రిగారి భార్య, సాయంత్రం మెయిలులో తాను, పిల్లలు బరంపురం పుట్టింటికి వెళ్ళదలచినట్లు, మా పినతండ్రి గారికి, సెలవు దొరకనందువలన, నేను సాయం రాక తప్పదని అన్నారు. ఎలాగూ సెలవులవడంచేత, మరేమీ పనిలేకపోబట్టి 'సరే' అన్నా. ఆ దినం బరంపురం వెళ్లాం. తిరుగు రైల్లో వచ్చేద్దామనుకున్నా. కాని చాలా రోజుల నుంచీ వెళ్ళక పోవడంచేత, మూడు నాలుగు రోజులు ఉండందే వదిలేరు కాదు. ఇంకా నాలుగు రోజులు ఉండమని బలవంతం చేస్తున్నా వెళ్ళిపోతే చిరంజీవికి ఆస్పత్రిలో ఇబ్బంది ఔతుందని చెప్పి తిరిగి వచ్చేశా. ఇంటికి వచ్చేసరికి శీను ఇంకా భోజనం చెయ్యకపోవడంచేత ఇద్దరం కలిసి భోజనంచేసి మా గదిలో పక్కలు పరుచుకున్నాం. "చిరంజీవి ఎలా ఉన్నాడని" శీనుని అడిగా.

"పూర్తిగా కోలుకొన్నాడు. బహుశా మరో నాలుగైదు రోజులలో ఇంటికి వెళ్ళడానికి అనుమతి ఇస్తారు" అన్నాడు.

"ఇంకేమైనా విశేషాలున్నాయా?" అన్నా.

"నీ కోసం అనసూయమాత్రం తెగ కలవరిస్తోందిరా భాయ్! నువ్వు వెళ్ళిన తరువాత నీ గురించి రోజుకు వందసార్లయినా అడుగుతోంది; ఆవిడగారి అనుమతి తీసుకోందే నీవు వెళ్లావని అందిరా" అన్నాడు నవ్వుతూ.

★ అనసూయ ★

"ఇది మరీ బాగుంది" అన్నా.

"బాగుండడం ఏమిటి, కథ చదువుతున్నావ్, కానీ" అన్నాడు.

ఇంతలో మా గదిలోకి ఎవరో రావడం నుంచి ఆ ప్రసక్తి కట్టిపేశాం.

సాయంత్రం నాలుగ్గంటలకు స్నానం చేసి బట్టలు వేసుకుని ఆసుపత్రికి వెళ్లా. చిరంజీవితో కొంతసేపు బరంపురం కబుర్లు వగైరాలు మాట్లాడిన తరువాత, "అనసూయ ఏమైంది" అని అడిగా. నాలుగు గంటలతో డ్యూటీ అయిపోవడంవల్ల బహుశా క్వార్టర్సుకు వెళ్లిపోయి ఉంటుందని చెప్పాడు. "రాత్రి పడుకోవడానికి వచ్చేదా?" అని అడిగా. "లేదు! అవసరంలేదు. అసలు రెండు మూడు రోజుల క్రితమే కనుతో ఎవరూ రానక్కరలేదని చెప్పా. ఇప్పుడు మామూలుగా లేచి తిరగగలను కాబట్టి బాధ లేదు. ఎవరూ రానక్కరలేదు," అన్నాడు. "సరే రేపు వస్తానని" చెప్పి బయలుదేరా.

అదివరకే రెండుమూడుసార్లు అనసూయ క్వార్టర్సుకు రమ్మనడంచేత పోనీ ఒకసారి చూద్దామనుకుని క్వార్టర్సుకు వెళ్లా. ఆమె తన గది నంబరు, వగైరాలు తెలియజేసినా అదే మొదటిసారి కావడంనుంచి, ఇద్దరు ముగురు నర్సులను అడగందే ఆమెగది తెలిసిందికాదు. ఎలాగయితేనేం ఆమె గదికి చేరుకున్నా. నన్ను చూచి లోనికి రమ్మని ఆహ్వానించింది. "ఏమండీ! బరంపురంనుంచి, ఈ దినమే వచ్చారా?" అంది. "ఔనండి" అన్నా. కొంతసేపయిన తరువాత, "ఏమండీ, అలా బీచికిపోయి కాస్సేపు కూర్చుందామా?" అంది. ఆమెతో ఒంటరిగా కలిసి వెళ్లడానికి భయపడినా, మొహమాటంచేత, ఆ మాట అనలేక "పదండి వెళ్దాం" అన్నా.

బీచికి బయలుదేరాం, అన్నమాటేగాని, అంతవరకూ ఎన్నడూ పరాయి ఆడవాళ్లతోనూ అందులో వయస్సులో ఉన్న అమ్మాయిలతోనూ తిరగడం అలవాటు లేకపోవడంచేతా, దీనికితోడు, ఏ తెలిసిన వాళ్లయినా మమ్మల్ని చూసి, ఈ విషయం మా పినతండ్రిగారికి చెప్తారంటే చీవాట్లు చెప్పుదెబ్బలు తప్పవనే భయంతోనూ పరధ్యానంగా ఆమెతో నడుస్తున్నా. అదృష్టవశాత్తూ త్రోవలో తెలిసినవాళ్ళెవరూ కనపడలేదు. బీచిలో దూరంగా, ఎవ్వరూలేని ప్రదేశంలో కూర్చున్నాం బహుశా ఆరు గంటలై వుంటుంది. మౌనంగా కొద్ది నిముషాలు గడిచాయి.

"ఏమండీ, అదోలా ఉన్నారు?" అంది.

"అబ్బే, ఏమీ లేదండీ" అన్నా లేనినవ్వు తెచ్చుకుని.

కొద్దిసేపు, ఆ కబుర్లూ, ఈ కబుర్లూ అయ్యాయి.

అంతకు రెండుమూడు దినముల క్రిందటే జీవరత్నం అన్న నర్సు ఆత్మహత్య చేసుకుని మరణించిందన్న విషయం జ్ఞాపకంరాగా ఆవిషయం ఆమెను అడిగా.

చెప్పుకుపోయింది. జీవరత్నానికి తనకూ ఏమీ పరిచయం లేకపోయినా, తన రూమ్ మేట్ ద్వారావలన వివరాలు తనకు తెలిశాయట. జీవరత్నానికి, రాజారాం అనే మేల్ నర్సుతో సుమారు ఒకసంవత్సరంగా మంచి స్నేహమట, అతనితో తరచు, సినిమాలకు, బీచికిపోయేదట. అతను, తాను మంచి స్థితిపరుడనని, ఆమెను తప్పక వివాహం చేసుకుంటానని చెప్పి ఆమెకు లేనిపోని ఆశలు కల్పించి, ఐదూపదీ ఆమె క్రింద ఖర్చుపెడుతూ వశపర్చుకున్నాడుట. తత్ఫలితంగా ఆమెకు గర్భం కలిగిందట. గర్భవిచ్ఛిత్తికి చేసిన ప్రయత్నాలు ఫలించక పోగా, ఈ విషయం, ఆస్పత్రి అధికారులకు తెలిసి ఆమెను పనినుండి తొలగించారుట. ఎన్ని విధాల ప్రాధేయపడ్డా రాజారాం చేరనీయక పోవడంతో, జీవితంమీద విరక్తితో ఆత్మహత్య చేసుకుందిట. రాజారాం విషయం



తరు[ణి]చ్ఛాయ!

—చిత్రకారుడు: వి. పూర్ణానందశర్మ]

మాత్రం ఆమె బయటపెట్టలేదుట. కేవలం జీవితంమీద విరక్తితో, ఆత్మహత్య చేసుకున్నానని, దీనికి తన తెలివితక్కువతనం తప్ప, మరెవ్వరూ బాధ్యులు కారని మాత్రం జాబులు రాసి, పోలీసు సూపర్నెంటుకు, ఆస్పత్రి అధికారులకు పోస్ట్ చేసిందట.

అంతా ఓపిగ్గా విని ఒక్క నిట్టూర్పు విడచా.

'చూశారా, అందుకే వయస్సులోవున్న ఆడపిలలు, అందులో నలుగురు మొగాళ్ళతో కలిసి పని చెయ్యవలసిన వాళ్ళు, చాలా జాగ్రత్తగానూ, తెలివితేటలతోనూ మెలగాలి. వ్యామోహంలోపడి ఏమాత్రం తప్పటడుగు వేసినా జీవితం సర్వనాశనమౌతుంది" అన్నా.

ఆమె ఆదోవిధంగా నన్ను చూసి మౌనంగా ఊరుకుంది.

అనసూయకు బహుశా పదిహేడుసంవత్సరాలకంటె హెచ్చు ఉండవేమో. చామన ఛాయ శరీరంతో సహజంగాచక్కగాఉండే ఆమె,ఆదినం, తలకు స్నానంచేసి, వేసుకున్న పల్లజాకెట్టు, గులాబీరంగుచీరలో ఎంతోఆకర్షణీయంగా కనపడుతూంది. విశాలమైనకళ్ళు, తీరైన పళ్ళవరుస, పొడవైన జడ, చిరునవ్వులుచిందే ఆమె ప్రశాంతమైనముఖాన్ని చూస్తూ ఏదో ఆలోచిస్తున్నా.

ఏమండీ, అంతదీక్షగా చూస్తున్నారు? అంది నవ్వుతూ.

"నేను ఒక్కమాట అంటా. మీకుకోపం రాదుకదా? అన్నా.

"లేదు. భయంలేదు చెప్పండి" అంది.

"నిజానికి మీచక్కదనం, ముఖంలోని సౌజన్యం చూస్తూఉంటే మీలో ఉత్తమ ఇల్లాలుఅయే లక్షణాలు కనపడుతున్నాయి. ఆభగవంతుడు మీకు ఎందుకు ఈకష్టాలు తెచ్చిపెట్టాడో? మీరు 'నర్సుగా' పనిచెయ్యడం మాత్రం నాకు బొత్తిగా ఇష్టంలేదు' అన్నా.

"అదృష్టానికి నోచుకోనపుడూ, యౌవనంలోఉండే సుఖానుభూతులకు దూరమైనపుడు రోగగ్రస్తులైన తోటిమానవులకు సేవచెయ్యడంకంటే ఏంకావాలండీ?" అంది.

"రోగగ్రస్తులకు సేవచెయ్యడంకంటే ఉత్తమమైనది లేదనే అభిప్రాయంతో నేనూ ఏకీభవిస్తా. కానీ కేవలం రోగులకు సేవచెయ్యడమే, మీ పరమావధిగా పెట్టుకొని ఐహికసౌఖ్యాలకోసం, ప్రాకులాడక పోయినా, ఈ ఆస్పత్రి వాతావరణంలో వయస్సులోయున్న మీలాంటి సౌందర్యవతులను చూస్తే ఓర్వలేనివాళ్ళెందరో ఉన్నారు. మీకు తెలియకుండానే మిమ్మల్ని తప్పుత్రోవలు త్రొక్కించి వాళ్ళ అవసరాలను తీర్చుకుంటారు" అన్నా.

ఆమె అంతా ఓపిగ్గావిని, టైము చూచి "అబ్బ ఎనిమిదిగంటలయింది. ఇక వెళ్దాం" అంది. సరేనని ఆమెను నర్సుల క్వార్టర్సుదాకా దిగబెట్టి ఇంటికి వచ్చా.

* * *

ఆ దినం చిరంజీవి డిస్చార్జి అయ్యేరోజు. ఎండతగ్గినతరువాత, నాలుగుగంటల వేళకు ఒక టాక్సీమాట్లాడుకుని, నేనూ సీనూ కలిసి ఆస్పత్రికివెళ్ళాం. ఆస్పత్రికి చెల్లించవలసిన సొకం చెల్లించి డాక్టరుగారివద్ద సెలవుతీసుకున్నాం. చిరంజీవి, పరిచయమున్న నర్సులకూ.హౌస్ సర్జన్‌కు ధన్యవాదాలు అర్పించి, కారులో కూర్చున్నాడు. అనసూయ, ఆ సమయానికి లేదు. చిరంజీవి, తనకుబదులుగా నన్ను ఆమెకు ధన్యవాదాలు తెలియజెయ్యమన్నాడు. మీరు కారులో ఇంటికివెళ్ళండి, నేను తరువాత వస్తా"నని చెప్పి తిన్నగా నర్సుల క్వార్టర్సుకు బయలుదేరా.

మిగిలిన నర్సులకు డ్యూటీఉండడంచేత అనసూయ ఒక్కతేఉంది. నన్ను చూడగానే "రండి కూర్చోండి" అంది. నేను మంచం మీద కూర్చున్నా. ఎదురుగా ఆమె స్టూలు మీద కూర్చుంది.

"ఏమండీ మంచినీళ్ళు తాగుతారా" అంది.

"ఇవ్వండి," అన్నా. శుభ్రంగా కడగిన గాజుగ్లాసులో, కూజాలోని చల్లటినీళ్ళు పోసి ఇచ్చింది,

"ఏమండీ చిరంజీవిగారు ఇంటికి వెళ్ళిపోయేరా" అంది.

"ఆ, ఇప్పుడే కారుఎక్కించి ఇలా వచ్చా. మీకు తన ధన్యవాదాలు తెలియజెయ్యమన్నాడు. అవకాశం చిక్కితే రాజమండ్రీ వెళ్ళేలోగా మిమ్మల్ని కలుస్తానని చెప్పమన్నాడు" అన్నా.

"అయితే మీకు ఆసుపత్రి డ్యూటీ ఈ దినంతో అయిపోయిందన్నమాట," అంది.

"ఆ, భగవంతుని దయవలన ఈ బాధవదిలింది, ఇక ఈ ఆసుపత్రిముఖం చూడక్కరలేదు" అన్నా.

కొదినిముషాలు మౌనంగాగడిచాయి.

ఆమె కళ్ళంట నీళ్లుకారుతున్నాయ్. ఆశ్చర్యపోయా, ఏం, మాట్లాడడానికి తోచక "ఏమండీ అలాఉన్నారు?" అన్నా.

"అబ్బే ఏమీ లేదండీ" అంది కళ్లుతుడుచుకుంటూ.

"ఏమండీ మిమ్మల్ని ఎవరైనా ఏమైనా అన్నారా?"

ఆమె మాట్లాడలేదు.

"అసలు సంగతేమిటండి" అని గట్టిగా అడిగా.

"మధ్యాహ్నంనుంచీ నా మనస్సుఏమీ బాగులేదండీ" అంది.

"కారణం చెప్పండీ" అని ప్రాధేయపూర్వకంగా అడిగా.

"చిరంజీవిగారు వెళ్ళిపోయాక మీరు ఆసుపత్రికి రావలసిన అవసరంలేదుకదూ?" రెండునిమిషాలు ఆలోచించి. "లేదండీ మిమ్మల్ని చూడడానికి అప్పుడప్పుడు వస్తానండీ" అన్నా.

"మిమ్మల్ని చూసిన వేళావిశేషమేమిటో గాని, మీతో పరిచయమై ఇరవైరోజులే అయినా, మీతో ఎంతో సన్నిహితత్వం ఏర్పడింది. చిరంజీవిగారు ఇంటికి వెళ్ళిపోయిన తరువాత మీరు రావలసిన అవసరం లేదు, ఇక మీరు రారేమోనన్న ఆలోచన వచ్చి నా మనస్సంతా పాడైంది. ఈ ఉదయం భోజనంకూడా సరిగ్గా చెయ్యలేకపోయా" అంది దీనంగా.

ఆమెపరిస్థితిచూస్తే ఎంతో జాలివేసింది. "నిజంగా చెపున్నా. ఎలాగూ సెలవుకాబట్టి, తరచువచ్చి మిమ్మల్ని చూసిపోతుంటా. ధైర్యంగా ఉండండి". అన్నా.

అప్పటికి ఆమెకు కొంత నమ్మకం, ధైర్యంకలాయి. సుమారు అరగంట అవడంనుంచి.

'ఇకవెళ్తానండీ' అన్నా.

"మీకేమీ అనుకోకపోతే చిన్నపనిచేసిపెట్టాలి," అంది.

"ఫరవాలేదు చెప్పండి" అన్నా.

"మా అమ్మకు రాసిన, ఈ జాబు పోస్ట్ చెయ్యాలి. తరువాత మీరు మళ్ళీ వచ్చేటప్పుడు రెండు కవరులు కొని తేవాలి" అని డబ్బులు ఇవ్వబోయింది.

అలాగే అని, డబ్బులు పుచ్చుకోకుండా, కవరుమాత్రం తీసుకుని ఇంటికివచ్చా.

రాత్రి భోజనంచేసిన తరువాత సీనుతో విషయమంతా చెప్పా.

వాడు నవ్వుతూ "ఇంకేం నీ రొట్టెవిరిగి నేతిలోపడింది," అన్నాడు.

* * *

మరోవారంరోజులకు చిరంజీవి రాజమండ్రీ వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయేముందు మాత్రం అవకాశం చూసి నేం ఇద్దరమే ఉంటున్నపుడు. "ఒరే అనసూయతో స్నేహం తప్పని అనను కాని, చాలా జాగ్ర

(54-వ పేజీ చూడండి)

అధైర్యపడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీకు ఉండుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904) మలకపేట బిల్డింగ్సు, హైద్రాబాద్ - 8. (దక్కన్)

★ అనసూయ ★

(23 వ పేజీ తరువాయి)

త్తగా మసలుకో. పతివిషయం బాగా ఆలోచించు మీ ఇదరకూ ఏవిధమైన చెడుసంబంధం లేకపోయినా, మీ ఇదరూ కలిసి తిరగడం ఎవరైనా చూచి, శంకరం మామతో గాని, మీ నాన్నతో గాని చెప్తే పెద్ద రాద్ధాంతమౌతుంది జాగ్రత్త" అన్నాడు. నాకంటే వయస్సులో చిరంజీవి ఐదు, ఆరు సంవత్సరాలు పెద్దైనా, మా యిద్దరికీ బాగా చనువు ఉండడంనుంచి అతనిమాటలకు "నేను ఏమీ బాధపడలేను. నేను వద్దు వద్దంటున్నా వినకుండా "నాలుగు సినీమాలు చూడరా" అని ఓ పదిరూపాయిలనోటు నా జేబులో పెట్టేశా. సీనుకూడా చిరంజీవితో నే రాజమండ్రీ వెళ్ళిపోయాడు. పరీక్షా ఫలితాలు తెలియడానికి కనీసం మరొక నెలదినాలైనా పడుతుంది. మా నాన్న గారు ఇంటికిరమ్మని జాబురాసినా, ఆ పల్లెటూరిలో ఏం తోస్తుంది? అంచేత ఎక్కడకూ వెళ్ళ నిశ్చయించుకోలేదు. రోజులు మామూలుగానే గడచిపోతున్నయ్. నాలుగేసి రోజులకు మాత్రం ఒకసారి వెళ్ళి అనసూయనుచూసి ఆమె యోగక్షేమాలు కనుక్కుంటున్నాం.

ఆనాడు శనివారం మధ్యాహ్నం ఇంగ్లీషు మేటినీ వదిలేసరికి మూడు గంటలయింది. ఇంటికి వెళ్ళిమాత్రం చేసేదేముందని, అజంతాలో ఒక కప్పు కాఫీతాగి అనసూయవద్దకు వెళ్ళా. ఆ దినం, మిగిలిన రూమ్ మేట్లు కూడా ఉన్నారు. మామూలు యోగక్షేమాలు అయినతరువాత, "ఏమండీ మీతో చాలా మాట్లాడాలి అలా సముద్రపు ఒడ్డుకు పోదామా?" అంది మెల్లగా 'సరే' అన్నా.

చాలాదూరం నడచి, ఎవ్వరూలేని ప్రదేశంలో ఇసుకలో కూర్చున్నాం. కొదిసేపయినతరువాత, "ఏమండీ. మీతో పది, పదిహేనురోజులనుండి కొన్ని విషయాలు చెప్దామనుకుంటున్నా, కానీ చెప్పలేకపోతున్నానండీ" అంది.

"ఫరవాలేదు, చెప్పండి" అన్నా.

"మొదట్లో అంతగా బాధించకపోయినా, ఇప్పుడిప్పుడు ఈ నౌకరీచెయ్యడం, చాలా కష్టంగా ఉందండీ, ఇలా కుళ్ళుతూ బ్రతికేకంటే చస్తే నయమేమో" అంది బాధగా.

"అంటే"

"వెంకటేశం, ఆ నేనర్సు మీకు తెలుసా?"

"ఆ, పరిచయం లేకపోయినా, అతన్ని ఒకసారి చూచా"

"అతను నన్ను నిత్యం వేధించుకు తింటున్నాడండీ ఇక రాత్రిడ్యూటీఅయితే అసలు చెప్పే అక్కర్లేదు."

"మీరు జాగ్రత్తగా మసలుకుంటే సరిపోతుందిగా" అన్నా మామూలు ధోరణిలో.

"ఏం జాగ్రత్తండీ. ఏదో మిషమీద రావడం, మాట్లాడ్డం, హాస్యాలు, నవ్వులు మరీ దగరగా రావడం, సినీమాకు రాకూడదా? బీచికి రాకూడదా? అని నిత్యం ఏడిపిస్తున్నాడండీ."

మీరు సతీ అనసూయకు తీసిపోరు; మరేం భయపడకండి," అన్నా నవ్వుతూ.

"అంతే కాదండీ, ఆమధ్య ఓనాడు నైట్ డ్యూటీలోఉండగా ఎవరూలేకుండా చూసి హఠాన్ సరన్ ఏవేవో మాట్లాడుతూ, నా చెయ్యిపట్టుకో బోయారండి" అని ఏడ్వ ప్రారంభించింది.

ఇక లాభంలేదనుకుని, "చూడండి జీవితంలో అందులో వయస్సులో ఉన్న మీలాంటి అమ్మాయిలు ఉద్యోగాలుచేస్తూ మగవాళ్లతో మసలవలసినపుడు ఇలాంటి సమస్యలను ఎన్నో ఎదుర్కోవాలి. తమ స్వార్థంకోసం, మీలాంటివాళ్ళను, ఆటవస్తువులుగా ఉపయోగింప చూసుకునే పెద్ద మనుష్యులనుండి ఓర్పుగా, నేర్పుగా తప్పించుకుని రోజులు గడపాలి" అన్నా.

"ఎంత దూరంగా ఉందామనుకుంటే అంత దగ్గరగా రావడానికి ప్రయత్నిస్తారు. వీళ్లనుండి తప్పించుకోవడమెలా?" అంది.

"నిజమే. ఈ వాతావరణంలో, ఉద్యోగం చేస్తూ, శీలాన్ని చెడగొట్టుకోకుండా బయటపడడమంటే ఉట్టితో స్వర్గానికి వెళ్ళడమే," అన్నా.

"ఏమోనండీ, ఇవన్నీ చూస్తూఉంటే పని మానేసి ఇంటికి వెళ్లిపోదామనుకుంటున్నా" అంది.

"అన్నట్టు ఒక విషయం, మీతో చెప్దామనుకున్నా. నిన్న పత్రికలో, టీచరు ట్రైనింగుకోసం దరఖాస్తులు పంపవలసిందిగా ఒక ప్రకటన చూచా, మీరు దానికి ప్రయత్నిస్తే అన్నివిధాలామంచిది ఎలాగో ఒకలాగు కష్టపడి ఒక సంవత్సరం, ట్రైనింగు పూర్తిచేశారంటే, జీవితాన్ని ఇంతకన్నా ప్రశాంతంగా, నిర్భయంగా గడుపవచ్చు" అన్నా.

"నిజమేకాని సీటుదొరకడం చాలా కష్టమేమోనండీ" అంది.

"అభ్యర్థుల ఎన్నిక రాజమండ్రిలో జరుగుతుంది కాబట్టి మీగురించి ప్రయత్నించమని, చిరంజీవి పేరరాస్తా" అన్నా.

"అయితే ప్రయత్నించండి, అదృష్టముంటే ఈ నరకంనుండి బయటపడతా. మా అమ్మ, తమ్ముడూ కూడా నావద్దే ఉండవచ్చు" అంది ఆశగా.

ఆతరువాత "అయితే ఈ విషయాలన్నీ మా అమ్మకు రాస్తా. అవసరమైతే కాపురం బళ్ళారినుండి రాజమండ్రీ మార్చడానికి సిద్ధంగా ఉండమని తెలియజేస్తా" అంది.

"సరే రాయండి" అన్నా, అప్పటికే ఎనిమిది దాటడంనుంచి ఆమెను క్వార్టర్సుకు దిగబెట్టి ఇంటికి వెళ్ళిపోయాను.

* * *

అమర్నాడే ఆమె అప్లికేషన్ పంపుతూ, వేరే చిరంజీవి పేర విషయాలు వివరిస్తూ ఏమాత్రం అవకాశంఉన్నా ఆమె సీటు గురించి గట్టిప్రయత్నం చెయ్యమని జాబు రాశా. వారం దినములతరువాత జవాబు రాశాడు. తనకు హైద్రాబాదు ట్రాన్స్ఫర్ అయిందనీ, మరో పదిదినములో సకుటుంబంగా వెళ్ళిపోవాలనీ, అయినా ఒక హెడ్ గుమాస్తా తనకు బాల్యస్నేహితుడవడంనుంచి అతనితో, అనసూయ సీటు గురించి గట్టిగా చెప్పేనని, తొంభైవంతులు సీటు దొరకవచ్చనీ.

ఎలాగయితేనేం అన్నీ సవ్యంగా జరిగాయి. అనసూయకు సీటు లభించింది. ఆస్పత్రిలో ఆమె రాజీనామాకూడా తేలిగ్గా అంగీకరించారు. ఆమె రాజమండ్రి వెళ్లిననాడు, స్టేషనుకు వెళ్ళి దిగబెట్టా. నా ఎడ్రసు ఒక కాగితంమీద రాసి అప్పుడప్పుడు "మీ యోగక్షేమాలు తెలియజెయ్యండి" అని ఇచ్చాను. "తప్పకుండా రాస్తా. మీరు మాత్రం నన్ను మరచిపోకండేం" అని కన్నీళ్లు తుడుచుకుంటూ రైలెక్కింది.



అనసూయ

మరోవారం దినాలకు రాజమండ్రినుంచి శీను వచ్చాడు. చిరంజీవి కుటుంబంతో సహా హైదరాబాదు వెళ్ళిపోయేడనీ, అనసూయ స్కూల్లో ప్రవేశించిందని, వాళ్ళ అమ్మగారు తమ్ముడూకూడా. కాపురం ఎత్తేసి బళ్లారి నుంచి వచ్చారనీ, వాళ్లకు పదిహేను రూపాయలకు ఒక ఇలు చిరంజీవే చూశాడని, ఈ సంగతులు విన్న తరువాత నామనస్సు కొంత తేలిక పడింది.

* * *

ఇంటర్ ఫలితాలు వచ్చాయ్. శీను సెకండుక్లాసులో ప్యాసయ్యాడు. నేను ఒక పార్టులో తప్పేను. మా కుటుంబ పరిస్థితులు తారుమారవడంచేత చదువుకు స్వస్తి చెప్పి ఉద్యోగ ప్రయత్నంలో పడ్డాను. అదృష్టవశాత్తూ రైల్వేలో, కురదారోడ్ లో దొరికిన గుమాస్తా గిరీకి అతుక్కుపోయా. శీను బి. యస్. సి. లో చేరాడు. తప్పక జాబు రాస్తానన్న అనసూయవద్ద నుంచి ఒక్క జాబైనా లేదు. చిరంజీవివాళ్లు వెళ్లిపోవడంచేత రాజమండ్రిలో మరెవరూ బంధువులు లేకపోవడంచేత ఏసందర్భంలోనూ, రాజమండ్రి వెళ్ళవలసిన అవసరం లేకపోయింది. అతరువాత అనసూయ విషయమే ఏమీ తెలియలేదు.

రెండు సంవత్సరాలు దొర్లిపోయాయి. ఎడతెరిపిలేని ఆఫీసుపనితో విసిగి, దానికితోడు చిరంజీవి రమ్మని పదేపదే జాబులు రాయడంవల్లా, పదిహేను రోజులు శెలవు పెట్టి, హైదరాబాదు వరకూ పాస్ తీసుకుని బయలుదేరా. విజయవాడ అంతకుముందెప్పుడూ చూడకపోవడంచేత ఒకటిరెండు రోజులుండి చూచిపోదామని విజయవాడలో దిగా. హోటల్లో సామాన్లుపడేసి కాఫీతాగి, ఇంకా ఉదయం తొమ్మిది గంటలే కావడంచేత వీధిలో పడ్డా. బజారులో ఒక పెద్ద బటలషాపులోని షోరూమ్ లోంచి కనపడుతున్న రకరకాల బట్టలు పరీక్షలనగా చూస్తూ నడచిపోతున్నా. ఆ షాపుదాటి పది అడుగులు వేశానో, లేదో "సార్ మిమ్మల్ని ఇన్‌స్పెక్టరుగారు రమ్మంటున్నా"రని ఒక కానిస్టేబుల్ పిలిచాడు.

నా తలమీద పిడుగుపడ్డట్టయింది.

చేసేదిలేక, భయపడుతూ "ఎక్కడున్నారు?" అన్నా.

"ఆ బట్టల షాపులోసార్" అన్నాడు.

వెనక్కు నాలుగు అడుగులు వేసి షాపు చూద్దునుకదా షాపు గుమ్మంలో ఒకపోలీసు ఇన్‌స్పెక్టర్, ఆయనపక్క ఒక ఇరవై సంవత్సరాల అమ్మాయ్, ఆమె చంకలో ఒక పాప!

ఆమెను ఎక్కడో చూచినట్లుందే అనుకుంటూ దగరగా వెళ్ళాను.

ఆమెకూడా నన్ను ఆత్రుతగా చూస్తూ, బాగా దగరకు వెళ్ళినతరువాత "ఏమండీ నేను జ్ఞాపకం ఉన్నానా?" అంది నవ్వుతూ.

ఇంకెవరు. అనసూయ! "బాగుంది. జ్ఞాపకం లేకపోవడ మేమిటి!" అన్నా.

"దూరంనుంచి చూసి, మీ రేనన్న అనుమానంతో, ఆయనతో చెప్పి పిలిపించా. ఒకవేళ మీరు కాకపోతే క్షమాపణ చెప్పుకో వచ్చునని. ఇంతకీ ఈ ఊరు ఎప్పుడువచ్చారు ఎక్కడ దిగారు" అంది.

"హైదరాబాదు వెళుతూ, ఈ ఉదయం ఇక్కడ దిగేను. హోటల్లో ఉన్నాను," అన్నాను.

"ఏమంటీ, ఈయన సామానులు ఇంటికి తెప్పించండి," అంది ఇన్‌స్పెక్టరుగారి వైపు తిరిగి.

అంతవరకూ మౌనంగావున్న ఇన్‌స్పెక్టరు గారు, "ఆం. ఆ. ఏయ్ 407 నువ్వువెళ్ళి ఈయన సామాన్లు తీసుకురా" అన్నారు.

చేసేదమీ లేక, హోటలుగది తాళం, ఒక ఐగురూపాయల నోటు తీసి కానిస్టేబులుకు ఇచ్చి, వాళ్ళతోనే టేక్సీ ఎక్కి కూర్చున్నా.

* * *

ఇంటికి వెళ్ళిన తరువాత స్నానం వగైరాలు చేసి, వాళ్ళ వంటవాడు ఇచ్చిన కాఫీ తాగి, అనసూయ, నేను, ఇన్‌స్పెక్టరుగారు కొంతసేపు మాట్లాడుకున్నాము. తరవాత ఆయనకు పనివుందని స్టేషనుకు వెళ్ళారు. ఇంతలో దేవాలయంనుంచి అనసూయ తల్లిగారు రాగా, "అమ్మా, ఈయనే నేనే మూర్తిగారు" అని నన్ను పరిచయంచేసింది.

"నమస్కారమండీ" అన్నా.

"బాబూ మీరా. చాలా సంతోషం. మిమ్మల్ని ఇంతవరకూ ఎన్నడూ చూడకపోయినా, అనూ, మీగురించి తరచు చెప్తూనే ఉంటుంది. ఆస్పత్రిలో అను పనిచేస్తూ వుండగా, మీరు స్వంతచెల్లెలు కన్నా హెచ్చుప్రేమగా చూస్తూ అన్నివిధాలా సహాయపడేవారట. అసలుమీవల్లనే తనకి అదృష్టం పట్టిందని, అంటూంటుంది" అన్నారు.

"అబ్బే, నేనుచేసింది ఏమీలేదండి, దీనికంతకూ ఆమె మంచినడవడికా, అదృష్టమే కారణం" అన్నా.

మధ్యాహ్నం భోజనాలయిన తరువాత అనసూయ చెప్పింది. రాజమండ్రిలో తాము అద్దెకున్న ఇంటికి ఎదురుగా, ఇన్‌స్పెక్టర్‌గారు ఉండేవారట కొంతకాలానికి వారిద్దరకూ చనువు ఏర్పడి క్రమంగా ప్రేమగా మారిందట.

ఇనస్పెక్టరుగారి తల్లిదండ్రులు ఈమె ప్రవర్తనచూచి తృప్తిపడటం, పైగా ఒకేకులం కాబట్టి అట్టే ఇబ్బందులు లేకుండానే పెద్దల అనుమతితోనే వివాహం జరిగిందట. అంచేత ట్రైనింగుకు సగంలోనే స్వస్తి చెప్పానని, తన తమ్ముడుకూడా స్కూల్ ఫైనల్ ప్యాసై మచిలీపట్నంలో ఆంధ్రా బ్యాంకులో పనిచేస్తున్నాడని, ఆమె తల్లి అతనివద్దే ఉంటున్నా ఆ మర్నాడు పాపకు అన్నప్రాశన అవడంనుంచి వచ్చిందనీ, మూడునెలలక్రితమే ఇనస్పెక్టరుగారికి ట్రాన్స్‌ఫర్ కాగా విజయవాడ వచ్చామనీ చెప్పింది.

అంతా విన్నతరువాత "చాలా సంతోషమండీ, ఇంతకూ మీలో ఉత్తమ ఇల్లాలు అయే లక్షణాలు ఉన్నాయని ఆనాడే అన్నా. జ్ఞాపకం ఉందా" అన్నాను.

ఆమె నవ్వి "ఆయన చాలా ఉదార స్వభావులు. వివాహమైన తరువాత, నా కష్టాలన్నీ గట్టెక్కి ఏ కొరతా లేక పోయినా ఈ విషయం మీకు తెలియజేయ లేకపోయాను కదా అని అప్పుడప్పుడు బాధపడేదానిని. మీరురాసిన ఎడ్రస్ కాగితం ఎక్కడో పారేసుకోవడంనుంచి. మీకు జాబులు రాయలేకపోయా. అదృష్టవశాత్తు ఈ దినం మీరు అనుకోని విధంగా కలియడంచేత ఇక నాకు ఏ కొరతా లేదు" అంది.

ఆ మర్నాడు బజారుకువెళ్ళి పదిహేను రూపాయిలు పెట్టి ఒక వెండిగిన్నె కొని పాపకు అన్నప్రాశన సమయంలో ఇచ్చాను.

సాయంత్రం రైలుకు బయలుదేరేముందు "ఏమండీ మీ ఎడ్రసు ఇవ్వడం మరచి పోయారు" అంది.

"ఎందుకండీ మళ్ళీ పారేయడానికేనా" అంటూ నవ్వుతూ రాసి ఇచ్చాను.

"మీరూ, చిరంజీవిగారు కలిసి తప్పక వస్తారుకదూ" అంటూ వీడ్కోలు ఇచ్చింది.

వద్దంటున్నా ఇనస్పెక్టరుగారు స్టేషన్ దాకా వచ్చారు. తేలికపడ్డ మనస్సుతో. ఈ విషయాలు చిరంజీవికి ఎంత వేగం చెప్తానా అన్న ఆత్రుతతో హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాను. ★

కలవరపడు స్త్రీలకు



"కుమారి" మాత్రలు
వాడువకండి మీ ఆరోగ్యం
రక్షించును. చింతఅనవసరం
వెల (సాదా) రు. 3/-
(స్పెషల్) రు. 5/-
(ఎక్‌స్ట్రా స్పెషల్) 8/-
పోస్టేజిప్యాకింగు ప్రత్యేకం

DEVEE & CO. (A.P.) Calcutta-40.